క్లుప్తంగా

గ్రామస్తులు బాధ్యత వహించాలి



బొల్లాపల్లి: పర్యావరణహిత జీవన విధానంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని జయంతి రామాపురం, వెంకటరెడ్డి పురం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనవిధానం, సుస్థిర ఆహార పద్ధతుల అవలంబన, నీటిని, ఇంధనాన్ని పొదుపు చేయడం, ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను తిరిగి వాడకుండా, ఎల్రక్ట్రానిక్ వ్యర్థాల నియంత్రణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. అటవీ సంరక్షణకు ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ శాఖ డీఆర్‌వో ఎం. హరికుమార్, గ్రామసర్పంచ్ వై.వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఎం.రాములునాయక్, ఎఫ్‌బీవోలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

29న మండల సమావేశం

ఈపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఉషాకిరణ్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

శరత్‌బాబు మృతికి సంతాపం

నరసరావుపేట: సినీ నటులు శరత్‌బాబు, సుధాకర్‌లకు శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

వినుకొండ(నూజెండ్ల) : మండల పరిధిలోని రవ్వవరం కొండ గురునాథ స్వామి దేవాలయం వద్ద అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు ఐనవోలు పోలీసులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేముల గ్రామస్తుడైన గోపిరెడ్డి వెంకటేశ్వర్లు (70) తన పంచెతో చెట్టుకు ఉరేసుకొని మృతిచెందినట్లు చెప్పారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులతో కలసి మృతుడు విజయవాడలోని గొల్లపూడిలో నివాసం ఉంటున్నాడని, అయితే మతిస్థిమితం లేకపోవడంతో ఈ నెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు వెల్లడించారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాశీం, రైటర్ సురేష్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

శావల్యాపురం: రానున్న ఖరీఫ్ సీజనుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. సోమవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో 30 శాంపిల్స్ తీయటానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. భూసార పరీక్షలు చేయించటం ద్వారా పోషకాలు ఆధారంగా ఎరువులు వినియోగించవచ్చునన్నారు. తద్వారా భూమిలో తగిన పోషకాలు పెరగటంతో పాటు దీంతో పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. రైతులు అధికంగా సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. అలాగే ప్రధానమంత్రి యోజన పథకంలో భాగంగా ఈకేవైసీ నమోదు చేయాల్సిన రైతులు 1264 మంది ఉన్నారని, ఈకేవైసీ నమోదు అయితేనే పీఎంకిసాన్ నగదు పొందటానికి రైతులు అర్హత పొందుతారన్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరణ

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి నూతనంగా బాలికల జూనియర్ ఇంటర్ కళాశాల బోధన ప్రారంభం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటరు ఆంగ్ల బోధన ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం కళాశాల్లో బోధన అధ్యాపకులుగా ఏడు మంది ఉపాధ్యాయులను నియామకం చేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరావులు ఉన్నారు.

మాటామాటా పెరిగి..

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో ఆదివారం రాత్రి యువకులు మధ్య ఏర్పడ్డ మాటమాట పెరిగి దాడుల వరకు దారితీసింది. ఈ దాడుల్లో మాచవరం దళిత వాడకు చెందిన నందిగం నాగరాజు, నందిగం సుందరరావుకు గాయాలయ్యాయి. గాయాలైన వీరు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనమర్లపూడిలో ఫ్యామిలీ డాక్టర్

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ప్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం నిర్వహిస్తునట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని ప్యామిలీ వైద్యాధికారి నిర్వహణ తీరు రికార్డులు, రోగులకు అందుతున్న వైద్యసేవలు స్వయంగా పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎల్ఎల్‌హెచ్‌పీ సంకీర్తన, ఆరోగ్య కార్యకర్త రాజ్యలక్ష్మి ఆశ పాల్గొన్నారు.

వివక్షకు తావులేని పాలన

- కులం, మతం, ప్రాంతం, పార్టీ ఊసే లేదు
- అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజలకు మేలు చేసే విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి వివక్ష లేదని, చూద్దాంలే అనే నిర్లక్ష్యం అసలే లేదని వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఏ ఇంటికి ఎంత మేలు జరిగిందో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటి విభేదాలు ఏవీ లేకుండా పనిచేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. ఏ పార్టీ వారైనా సరే ఎలాంటి వివక్ష లేకుండా సమానంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ప్రభుత్వం వచ్చిన మొదటి రోజు నుంచే టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పనిచేయాలని అప్పట్లో చంద్రబాబు నాయుడు బాహాటంగానే ప్రకటించారని వెల్లడించారు. అందుకు విరుద్ధంగా తమ నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ప్రభుత్వానికి ప్రజలంతా సమానమని, పార్టీ విభేదాలు చూడకుండా అందరికీ న్యాయం చేయాలని చెబుతూ ఆదర్శవంతమైన రాజకీయాలకు తెర తీశారని చెప్పారు. వృద్ధులకు ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటింటికీ వలంటీర్లు వచ్చి పింఛన్లు అందజేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకం ద్వారా నేరుగా ఆర్థిక లబ్ధిని ప్రజలు పొందేలా జగనన్న చూస్తున్నారని చెప్పారు. ఎవరి బ్యాంకు ఖాతాలకు ఏ సంక్షేమ పథకం కింద ఎంత మొత్తం అందుతున్నదో చెప్పడానికే తాము ఇప్పుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి తోడు ప్రతి ఒక్కరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు జగనన్న కాలనీలను ప్రభుత్వం నిర్మించి ఇస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా సాంబయ్య, గుత్తా యాములయ్య, అమీర్‌జాని, అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు విజయవంతమయ్యాయి

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- వినుకొండ రామలింగేశ్వరస్వామి ఘాట్ రోడ్డు, ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వర ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణం, దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీశైలం క్షేత్రం దర్శనం అనంతరం వినుకొండకు వచ్చిన ఆయన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. స్పీకర్‌కు ఎమ్మెల్యే సాదరంగా స్వాగతం పలికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, క్షేత్ర స్థాయిలో మంచి ఫలితాలను ఇచ్చాయని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని, ప్రజలు ప్రభుత్వంపై పూర్తిస్థాయి విశ్వాసంతో ఉన్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మరలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. శాసనసభ్యులు శాసనసభలో హుందాగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సానుకూల ధోరణి అవలంభించడంతో పాటు సమస్యలను పరిష్కరించే చొరవ ఉంటే ప్రజలు ఎన్నిసార్లు అయినా గెలిపిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గాన్ని చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే సేవలను అభినందించారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ధన్యవాదాలు తెలియజేశారు. బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కుటుంబసభ్యులు వందల ఎకరాలు ఆక్రమించారని, ఇప్పటికే ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకున్నారని, త్వరలోనే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే జీవీకి లేదన్నారు. టీడీపీ హయాంలో బీజేపీ, సీపీఐ, సీపీఎం అన్ని పార్టీలు కలిసి పోటీ చేశారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా వినుకొండలో పోటీ చేశారని, పేదల భూములను కూడా అమ్ముకున్న ఘనత సీపీఐకే దక్కుతుందని, పులుపుల వెంకటశివయ్య లాంటి ఆదర్శ నాయకులు పుట్టిన వినుకొండలో ఆ పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు దేవాలయాల్లో ఎమ్మెల్యే పూజలు



ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సుబ్బగురు యోగీంద్ర స్వామి వారి తిరునాళ్లను పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో...

వినుకొండ(నూజెండ్ల): రూరల్ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో శ్రీ సీతారామ స్వామి ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సభ్యులు, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లాకు ఘనస్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండాలి

పుడ్‌సేఫ్టీ అండ్ సరఫరాపై హోటల్ యజమానులతో అధికారుల సమీక్ష



మాట్లాడుతున్న అధికారులు

నరసరావుపేట: ప్రతి హోటల్ యజమానికి వంటకు వాడే పదార్థాలు నాణ్యంగా ఉంచుకోవల్సిన బాధ్యత ఉందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి సి.హెచ్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఓలేటి శ్రీనివాసరావు అధ్యక్షతన ఫుడ్ సేఫ్టీ అండ్ సరఫరాపై పురపాలక సంఘ పరిధిలో ఉన్న హోటల్స్ యజమానులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అండ్ సప్లైకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్క హోటల్ యజమాని తమ కస్టమర్లకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్క హోటల్, హోటల్ పరిసర ప్రాంతాలు హైజెనిక్‌గా ఉండాలని, అదేవిధంగా హోటల్‌లో పనిచేస్తున్నటువంటి సిబ్బంది ఆరోగ్యంగా ఉన్నారా లేదా అని ప్రతి ఒక్క యజమాని చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆహారాన్ని వృథా చేయకుండా చూసుకోవాలన్నారు. మరీ ముఖ్యంగా ఫుడ్ ప్యాకింగ్ కోసం ప్లాస్టిక్ కవర్స్ వాడుతున్నారని, దానివలన ప్రజల ఆరోగ్యానికి హాని కనుక ప్రతి ఒక్కరూ వాటిని వాడకుండా ఉండాలన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వరరావు, సచివాలయ శానిటేషన్ సిబ్బంది, హోటల్ యజమానులు పాల్గొన్నారు.

రైతులు ముఖ ఆధారిత ఈకేవైసీ చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మురళీ



సాతులూరులో ముఖ ఆధారిత ఈకేవైసీ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

నాదెండ్ల: పద్నాలుగో విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నగదు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళీ చెప్పారు. నాదెండ్ల మండలం, సాతులూరు, నరసరావుపూట రూరల్ మండలం జొన్నలగడ్డ రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి పద్నాలుగో విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయన్నారు. బయోమెట్రిక్, ఓటీపీల ద్వారా ఈకేవైసీ కాని రైతులు తప్పనిసరిగా ముఖ ఆధారిత ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. నెలాఖరు నాటికి సంబంధిత రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిపొందాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. స్వయంగా ఆయన కొందరు రైతులు ముఖ ఆధారిత ఈకేవైసీని కంప్యూటర్ ద్వారా నమోదు చేశారు. ఆయనతో పాటూ నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్, ఏఈవోలు బ్రహ్మయ్య, గోపిరెడ్డి, వీవోఏలు రామారావు, వేణుగోపాల్, ఫిలిప్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నాదెండ్ల: చందవరం గ్రామంలో పోలేరమ్మ దేవస్థాన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఎంఆర్ ఫౌండేషన్ అధినేత, ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లెల రాజేష్‌నాయుడు ఆలయ కమిటీ సభ్యులకు రూ.1 లక్ష విరాళం అందించారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు. చిలకలూరిపేట బొందిలిపాలెంలో ఈ నెల 24న జరిగే పోలేరమ్మతల్లి నవజాతర మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. 26న శుక్రవారం 11 గంటల నుంచి అన్నదానం జరగనున్నందున 5 వేల మందికి అన్నప్రసాద వితరణకు ఆర్థికసాయం అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో అద్దంకి బాలాజీసింగ్, బొందిలికిరణ్ సింగ్, చేజర్ల హనుమాన్‌సింగ్, నేలటూరి రవి, సీహెచ్ శ్రీను పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామ సమీపంలో అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన గుర్రం కోటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మోటారు సైకిల్‌పై కోటయ్య అదే మార్గంలో మరో కారు నకరికల్లు వైపు వెళ్తుండగా మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఒకే మార్గంలో రెండు వాహనాలు వెళ్తున్న సమయంలో ఢీకొనడంతో కారు రోడ్డు పక్కకు దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన గుర్రం కోటయ్యను వైద్యసేవల నిమిత్తం హుటాహుటిన నరసరావుపేట వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగురాలికి ఆర్థిక సహాయం



రొంపిచర్ల: మండలంలోని పరగటిచర్ల గ్రామానికి చెందిన బడుగు కామాక్షమ్మ కు వైద్యసేవల నిమిత్తం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గేరా చంద్రపాల్ రూ.10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. వికలాంగురాలైన కామాక్షమ్మ మోటార్ ట్రై సైకిల్ పై పరగటిచర్ల నుండి మాచవరం గ్రామంలోని సచివాలయానికి వెళ్తుండగా ప్రమాదం జరిగి కాలికి బలమైన గాయాలయ్యాయి. ఆమెను వైద్య చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న చంద్రపాల్ కామాక్షమ్మ చికిత్స పొందుతున్న నరసరావుపేటలోని సుస్మిత హార్థోట్రామా హాస్పిటల్‌కి వెళ్లి ఆర్థిక సహాయం చేశారు. అవసరమైతే మరి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని బాధితురాలికి చంద్రపాల్ హామీ ఇచ్చారు.

సాతులూరులో 104 వైద్య శిబిరం

నాదెండ్ల: సాతులూరు హెల్త్ సబ్‌సెంటర్–1లో సోమవారం 104 వైద్య వాహనం ద్వారా 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవిలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీ సీతామహాలక్ష్మి, డీఈవో పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌వో నాగరాధిక, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: ప్రేమలో విఫలం చెంది, మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని బాబుగారితోటకు చెందిన కుంచాల ప్రవీణ్ (19) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ఆరునెలల కిందట ప్రేమించిన యువతికి పెళ్లి అవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రవీణ్ అప్పటి నుంచి ముభావంగా ఉండేవాడు. రెండుసార్లు ఎలుకల పేస్ట్ తిని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ బొందిలపాలెం కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో రెండు ఎలుకల పేస్టులు తిని, సమీపంలోని గాజు సీసాతో మణికట్టుపై గాయపరుచుకున్నాడు. గమనించిన స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి కుంచాల ఆదిశేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్



శావల్యాపురం: మండలంలోని పొట్లూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో జిల్లాస్థాయిలో శ్రీప్రసన్నాంజనేయ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు పోటీలు సోమవారంతో ముగిసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తుల సౌజన్యంతో గత 16 రోజుల నుంచి పోటీలు నిర్వహిస్తున్నామని 65 టీంలు పాల్గొన్నట్లు చెప్పారు. మొదట బహుమతి ఫెండ్స్ సీసీ టీం సభ్యులు రూ. 15.116, రెండవ బహుమతి శావల్యాపురం హనుమాన్ సీసీ రూ. 10.116, మూడోవ బహుమతి పొట్లూరు శ్రీప్రసన్నాంజనేయ టిం రూ,7.116,నాల్గవ బహుమతి నూజెండ్ల బొల్లా బ్రహ్మన్న సీసీ రూ,5.116, మ్యాన్ ఆఫ్ ది సిరిస్ రూ.3.116 లు వినుకొండ డామినేటర్స్ టిం సభ్యులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో మండల వైస్సార్‌సీపీ కన్వీనర్ భీమని అంకారావు, మండల కోఆర్డినేటరు అబ్బూరి రామారావు,పోపూరి చిన్నా, గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌గా యడ్లపాడు జెడ్పీ పాఠశాల మార్పు

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్ గా మార్పు చేశారని మండల విద్యాశాఖాధికారి ఐ ఆంజనేయులు చెప్పారు. మండల పరిధిలోని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కాలేజీలో విద్యనభ్యసించాలని కోరారు. ప్రస్తుతం ఈ కాలేజీలో ఏడుగురు జూనియర్ లెక్చరర్స్ ఉన్నారని వారు తెలుగు, ఇంగ్లీషు, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులు బోధిస్తారని వెల్లడించారు.

దేవదాయశాఖ భూములకు పట్టాలివ్వాలి

నరసరావుపేట: దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో 30 ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న దేవదాయశాఖ భూములకు పట్టాలు ఇవ్వాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ (పీడీఎం) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సాగుచేసుకుంటున్న పేదలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ సుమారు 300 మంది ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీలు సాగుచేసుకుంటున్నారన్నారు. పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, 70మంది సాగుదారులు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యం తప్పనిసరి

ఆర్డీవో శేషిరెడ్డి



రీసర్వే పనుల పురోగతిపై మాట్లాడుతున్న ఆర్డీవో

శావల్యాపురం: రీసర్వే పనుల్లో రైతుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని నరసరావుపేట డివిజన్ రెవెన్యూ అధికారి (ఆర్డీవో) మద్దిరెడ్డి శేషిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించి రీసర్వే పనుల పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో 95 రెవెన్యూ గ్రామాలు ఉండగా అందులో 65 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తిస్థాయిలో అయినట్లు చెప్పారు. 42 రెవెన్యూ గ్రామాల్లోని 30 వేల మంది రైతులను గుర్తించగా 28 వేల మందికి జగనన్న భూరక్ష హక్కు పత్రాలను అందజేశామన్నారు. రీసర్వే పనులు మరింత సులభతరంగా అయ్యే విధంగా ప్రభుత్వ నూతనంగా సాఫ్ట్‌వేర్ మార్పు చేసినట్లు చెప్పారు. గతంలో 27 అంశాలను నమోదు చేయాల్సి ఉండగా నూతనంగా 17 అంశాలను అన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. రెవెన్యూ అధికారులు రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఫాం 9 (2) నోటీసులు ఇచ్చిన గ్రామాల్లోని రైతులకు తమ భూముల కొలతలు సరిహద్దులు విషయంలో ఏమైనా వివాదాలు అభ్యంతరాలు ఉన్న పక్షంలో సత్వరమే సమగ్ర ఆధారాలతో రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. వినుకొండ నియోజకవర్గంలో శావల్యాపురం, ఈపూరు మండలాల్లో రీసర్వే పనుల పురోగతిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. శావల్యాపురం మండలంలో వేల్పూరు, పొట్లూరు, పిచికలపాలెం, శానంపూడి రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులకు సంబంధించి రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ పరిధిలో రీసర్వే పనులు పూర్తిస్థాయిలో జరగలేదని రైతులు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. ఫామ్ 9(2) నోటీసులు సకాలంలో ఇవ్వలేకపోవటంతో కొందరు రైతులు నోటీసులు తీసుకోలేదన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ నోటీసులు రైతులు తీసుకోవాలని తదుపరి సమస్యపై లిఖిత పూర్వకంగా తెలిపితే రెవెన్యూ అధికారుల సమక్షంలో సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రీసర్వే పనుల పురోగతిపై రెవెన్యూ గ్రామాల వారీగా వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, వీఆర్వోలు వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, శ్రీనివాసరావు, అక్కయ్య, సర్వేయర్లు ఉన్నారు.

బడిలో నాణ్యమైన విద్య - మెరుగైన సౌకర్యాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించండి
- ఇంటింటికీ తిరిగి ఉపాధ్యాయుల వినతి



నాదెండ్లలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

నాదెండ్ల: ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి మంచి విద్యావంతులుగా ఎదిగేలా చూడాలని హెచ్‌ఎం వై.వాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలో పాఠశాలలో విద్యార్థులను చేర్చేందుకు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. చిన్నారుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నెల 8 నుంచి జూన్ 9 వరకూ ఐదు వారాల్లో ఉపాధ్యాయులు చేపట్టాల్సిన అంశాలపై వివరాలు అందజేసింది. సోమవారం నుంచి 26 వరకూ బడి బయటి పిల్లలను గుర్తించటం, 29– జూన్ 2 వరకూ డ్రాపవుట్స్‌ను గుర్తించి ఆయా వివరాలను సమీప పాఠశాలల్లో అందించటం, 5–9 వరకూ డ్రాపవుట్ చిన్నారులు తిరిగి పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాని, శేషయ్య, ఎల్ఎస్ రావు, దుర్గాదేవి, సత్యవతి, కె.రెడ్డియ్యాచౌదరి ఉన్నారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణులు కావాలి

విద్యార్థులతో డిప్యూటీ డీఈవో వేణుగోపాలరావు



ఎంఈవో, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో వేణుగోపాలరావు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం పల్నాడు జిల్లా డిప్యూటీ డీఈవో వేణుగోపాలరావు సందర్శించారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ తరగతులను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు చక్కగా రాసి ఉత్తీర్ణత సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం వచ్చే విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా కానుక కిట్లు మెటీరియల్ నాణ్యతను పరిశీలించారు. పాఠశాల పునః ప్రారంభం నాటికి విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో ఉపాధ్యాయులు ఎంతమంది విధులకు హాజరౌతున్నారో వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఎలా సాగుతుందోనని ఆరా తీశారు. ఆయనతో పాటూ ఎంఈవో ఆంజనేయులు, హెచ్‌ఎం వై వాణి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సుభాని, కెల్లంపల్లి రెడ్డియ్యాచౌదరి, సిబ్బంది ఉన్నారు.